క్లుప్తంగా

డీఈఓకు స్వల్ప అస్వస్థత

చిల్లకూరు: కౌన్సెలింగ్ నిర్వహణలో చిత్తూరు జిల్లా విద్యాశాఖాధికారి వరలక్ష్మి తీవ్ర ఒత్తిడికి గురై మెట్లెక్కుతూ కింద పడిన సంఘటన శుక్రవారం గూడూరు ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో చోటుచేసుకుంది. కళాశాలలో నూతనంగా ఎంపికైన డీఎస్సీ ఉపాధ్యాయులకు (ఎస్‌జీటీ)కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు. ఈ క్రమంలో ఆమె ఎస్‌జీటీ తమిళ, ఉర్దూ పోస్టింగులకు నియమితులైన 175 మంది ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ ఉదయం 8 గంటలకు ఆరంభించాల్సి ఉంది. అయితే 12 గంటలు అవుతున్నా ఆరంభం కాకపోవడంతో ఉన్నతాధికారులు ఆమెపై ఒత్తిడి తెచ్చారు. రాష్ట్ర విద్యాశాఖ ఐటీ విభాగం, జిల్లా విద్యాశాఖ మధ్య సమన్వయ లోపంతో ఖాళీలు ఎక్కడ ఉన్నాయనే విషయాలను ప్రచురించలేకపోయారు. దీంతో కౌన్సెలింగ్ ప్రకియ ఆలస్యం అయ్యింది. దీనికితోడు ఉన్నతాధికారులు ఒత్తిడితో ఆమె మెట్లెక్కుతూ తుళ్ళి పడిపోయారు. సిబ్బంది ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కోలుకున్న అనంతరం చిత్తూరులోని ఆమె ఇంటికి తరలించారు.

దివ్యాంగుల పిల్లలకు చేయూత



బోధనోపకరణాలు పంపిణీ చేస్తున్న అధికారులు

తవణంపల్లె: స్థానిక హైస్కూల్లోని భవిత కేంద్రంలో శుక్రవారం దివ్యాంగుల పిల్లలకు బోధనోపకరణాలు పంపిణీ చేశారు. అలింకో సహకారంతో సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ హేమలత,ఎంఈఓ2 మోహన్‌రెడ్డి దాత, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర చౌదరి, హైస్కూల్ హెచ్‌ఎం వేణుగోపాల్ రెడ్డి, సమగ్రశిక్ష ఏఈ మునిరత్నం, సహిత విద్య ఉపాధ్యాయులు దేవేంద్ర దిలీప్, సీఆర్‌పీ చిట్టిబాబు, దివ్యాంగుల పిల్లలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీవానది ఉగ్రరూపం..!

చిత్తూరు అర్బన్: చిత్తూరులో నీవానది ఒక్కసారిగా ఉగ్రరూపం దాల్చింది. గురువారం కురిసిన వర్షానికి చిత్తూరు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వర్షపునీరు నీవానదిలోకి రావడంతో నగరంలో వరద ప్రవాహం ఉధృతమైంది. శుక్రవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు వరద నీటి ప్రవాహం కొనసాగింది. సాయంత్రానికి కాస్త పరిస్థితి అదుపులోకి వచ్చింది. తేనబండ, గంగా కాలనీ, వీరభద్రకాలనీ, రాజుగుడి వీధి, లిల్లీబ్రిడ్జి, కైలాసపురం, తోటపాళ్యంలోని లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయ్యాయి. వర్షం పడ్డ ప్రతిసారీ ఇక్కడున్న వందలాది కుటుంబాలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమనే పరిస్థితి దాపురిస్తోంది.

చిన్నచూపు తగదు

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులను చిన్నచూపు చూడటం తగదని వైఎస్ఆర్‌టీఏ రాష్ట్ర ట్రెజరర్ రెడ్డిశేఖర్ రెడ్డి హితవు పలికారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేబినేట్ సమావేశంలో ఉద్యోగులకు అనుకూలంగా ప్రకటన వెలువడుతుందని లక్షలాది మంది ఉద్యోగులు, టీచర్లు ఎదురు చూశారన్నారు. అయితే ప్రభు త్వం మొండి చేయి చూపడం దారుణమని విమర్శించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ఐరాల: గర్భిణులు సమతుల ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతులు ఉంటారని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డెప్ప అన్నారు. శుక్రవారం పీహెచ్‌సీలో ప్రధానమంత్రి మాతృత్వ సురక్షిత అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేసి ఆయన మాట్లాడారు. మంచి వైద్యం అందించడానికి పీహెచ్‌సీలో ప్రతి నెలా 9వ తేదీ గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చిన్నమ్మ, హెల్త్ అసిస్టెంట్ మునిరత్నం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎస్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నేడు 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ'

చిత్తూరు కార్పొరేషన్ : స్థానిక 29వ వార్డు మిట్టూరులోని రెడ్డీస్ కాలనీలో శనివారం సాయంత్రం 4 గంటలకు 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానంద రెడ్డి తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

వర్షపు నీటిలో నిలబడి ఆందోళన



చిత్తూరు కార్పొరేషన్ : అధిక వర్షాలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నీవానది పరిసర ప్రాంతాల 10 వేల కుటుంబాలని ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం నీవానది ప్రాంతంలో ప్రవహిస్తున్న వర్షపు నీటిలో నిలబడి ప్రభుత్వం తీరుపై నిరసన వ్యక్తం చేశారు. బ్రిడ్జి నిర్మాణానికి రూ.175 కోట్లు మంజూరు చేయాలని కోరారు. పార్టీ నాయకులు గోపీనాథ్, మణి, రఘు, బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణులకు అభినందన

చిత్తూరు కలెక్టరేట్ : ఇటీవల అనకాలపల్లెలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో రన్నర్స్‌గా నిలిచిన పీసీఆర్ హైస్కూల్ క్రీడాకారిణులను హెచ్‌ఎం పూర్వాణి అభినందించారు. కార్యక్రమంలో పీడీ దేవానంద్ టీచర్లు పాల్గొన్నారు.

దంచి కొట్టిన వాన

- పురుగుల తయారీ ప్లాంట్‌పై పడ్డ పిడుగు
- షెడ్డు ధ్వంసం, కాలిపోయిన మోటార్లు
- రూ.3లక్షల ఆస్తినష్టం
- నారగల్లు వద్ద తెగిన తారురోడ్డు
- రాకపోకలు బంద్
- ప్రత్యామ్నాయంగా జేసీబీతో తాత్కాలిక దారి ఏర్పాటు



నారగల్లు వద్ద వర్షానికి కోతకు గురైన తారు రోడ్డు

గుడిపాల: మండలంలో పిడుగులతో కూడిన వర్షం దంచి కొట్టింది. గురువారం రాత్రి ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో వాగులు జోరెత్తాయి. చెరువులన్నీ మొరవలు పారాయి. మండలంలోని నారగల్లు నుంచి గోళ్ల తిమ్మయ్యకండిగకు వెళ్లే తారు రోడ్డు మార్గంలో వర్షం ఉధృతికి 800 అడుగుల పొడవునా రోడ్డు తెగిపోయింది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు బంద్ అయ్యాయి. ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. సమాచారం అందుకున్న తహసీల్దార్ శ్రీనివాసులు ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. జేసీబీతో ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేశారు. ఇక, చెరుకూరు కండిగ వద్ద పురుగుల మందు తయారీ ప్లాంట్‌పై పిడుగు పడడంతో ప్లాంట్ పాక్షికంగా కూలింది. అలాగే ఆరు మోటర్లు కాలిపోయాయి. ట్రాక్టర్ దెబ్బతింది. సుమారు రూ.3లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని ప్లాంట్ యజమాని మోహన్ తెలిపారు. పాపసముద్రం వద్ద రామిరెడ్డి చెరువు, గుడిపాల వద్ద చెరువు మొరవలెత్తడంతో గుడిపాల, పాపసముద్రం, పిల్లారికుప్పం, చిత్తపార, బండపల్లె గ్రామస్తులకు రాకపోకలను ఆపివేసి అక్కడ పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశారు. బంగారక్క చెరువు వద్ద మొరవ ఉరకలెత్తడంతో గ్రామస్తులు చెరువు వద్ద సెల్‌ఫోన్లలో సెల్ఫీలు తీసుకుంటూ ఎంజాయ్ చేస్తున్నారు. చీలాపల్లె నుంచి ఎస్ఆర్‌పేటకు వెళ్తున్న రోడ్డుపై చీలాపల్లె గ్రామం వద్ద నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. గంటల కొద్దీ వాహనాలను నిలిపివేశారు.



చెరుకూరు కండిగ వద్ద పురుగుల మందు ప్లాంట్ వద్ద పిడుగు పడిన దృశ్యం



నారగల్లు వద్ద ప్రత్యామ్నాయంగా రోడ్డు ఏర్పాటు చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు



మొరవ పోతున్న గుడిపాల చెరువు

గందరగోళంగా జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ఎగ్జిబిషన్



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : అతిథుల ఆలస్యం మూలాన విద్యార్థుల గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి నెలకుంది. స్థానిక పూలే భవనంలో శుక్రవారం కమర్షియల్ ట్యాక్స్ అధికారులు జీఎస్టీపై అవగాహన ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమం ఉదయం 9.30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా 11.47 వరకు ప్రారంభం అవ్వని పరిస్థితి. దీంతో పీవీకేఎన్, కృష్ణవేణి, ఎస్‌పీఎస్, పలు ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు నిరీక్షించాల్సి వచ్చింది. 11.47 గంటలకు మేయర్ అముద, కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వచ్చి కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో నగర కమిషనర్ నరసింహప్రసాద్, జీఎస్టీ జాయింట్ కమిషనర్ రవీంద్రనాథ్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ మహేష్, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించండి

గుడిపాల: పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని డీఎస్పీ సాయినాథ్ ఆదేశించారు. శుక్రవారం గుడిపాల పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసులపై సమీక్షించి పైవిధంగా ఆదేశించారు. అలాగే ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలని, వారు చెప్పే సమస్యలను సావధానంగా వినాలనన్నారు. విజిబుల్ పోలీసింగ్ పెంచాలని సీఐ శ్రీధర్‌నాయుడు, ఎస్ఐ రామ్మోహన్‌ను ఆదేశించారు. పోలీసులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు..

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని విజయం విద్యాసంస్థల చైర్మన్ తేజోమూర్తి అన్నారు. శుక్రవారం నగర సరిహద్దులోని సుందరరాజపురంలోని విజయం ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. తేజోమూర్తితోపాటు అతిథిగా చంద్రమోహన్ మాట్లాడారు. పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ శైలజ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ గోపి, విద్యార్థులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల ధర్నా



చిత్తూరు కార్పొరేషన్ : తపాలా ఉద్యోగులపై కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతోందని నిరసిస్తూ శుక్రవారం జిల్లా ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట ఉద్యోగులు ధర్నా చేశారు. దీనికి నేతృత్వం వహించి యూనియన్ నాయకులు భాస్కర్, సర్దార్ మాట్లాడారు. తపాలా ఉద్యమ జాతీయ నాయకుడు మహదేవయ్యను కేంద్రప్రభుత్వం ఉద్యోగం నుంచి తొలగించడం దారుణమన్నారు. గ్రామీణ తపాలా ఉద్యోగుల సంక్షేమానికి నియమించిన కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేయడం, 2023లో చేసిన సమ్మెకు మహదేవయ్య నాయకత్వం వహించడమే తప్పా? అని ప్రశ్నించారు. ఆయను ఉద్యోగంలోకి తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో నాయకులు విజయకుమార్, మహదేవన్, అరుణ, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ఉద్యమం

చిత్తూరు అర్బన్: ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరించడంపై తమ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమం కొనసాగుతుందని చిత్తూరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎంసీ.విజయానంద రెడ్డి స్పష్టం చేశారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూశుక్రవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో కోటి సంతకాల పోస్టర్లను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం తమ ప్రభుత్వ హయంలో మంజూరు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెడుతోందన్నారు. దీని నిరసిస్తూ పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. రైతులకు యూరియాను కూడా సక్రమంగా అందించని చంద్రబాబు నాయుడు.. యూరియా వేస్తే క్యాన్సర్ వస్తుందని, వరినాట్లు వేయొద్దని చెప్పడం సిగ్గుచేటన్నారు. కల్తీమద్యం దందాను నిరసిస్తూ 13న చిత్తూరులో ఆందోళన చేస్తామన్నారు. పార్టీ రాష్ట్ర పరిశీలకులు రాజశేఖర్‌రెడ్డి, చిత్తూరు మండల జెడ్పీటీసీ బాబునాయుడు, పార్టీ కన్వీనర్లు శ్రీధర్, ప్రకాష్, జయపాల్, నాయకులు జ్ఞానజగదీష్, హరిణిరెడ్డి, రజనీకాంత్, అంజలి, హరీషా పాల్గొన్నారు.

లారీ సహా కలప సీజ్

చిత్తూరు కార్పొరేషన్ : కర్ణాటక నుంచి శ్రీకాళహస్తికి కలపను అక్రమంగా రవాణా చేస్తున్న లారీని గురువారం అటవీశాఖ అధికారులు మొగలి వెంకటగిరి వద్ద స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. డీఎఫ్ఓ సుబ్బురాజ్ ఆదేశాల మేరకు రూ.40 వేల జరిమానా విధించినట్లు అటవీ అధికారులు తెలిపారు.

పోగొట్టుకున్న నగదు అప్పగింత

కాణిపాకం: కాణిపాకం బస్టాండ్ వద్ద ఓ భక్తుడు పోగొట్టుకున్న నగదును ఆలయ ఏఈఓ రవీంద్రబాబు అందజేశారు. వివరాలు.. రాజమండ్రికి చెందిన దుర్గాప్రసాద్ తన స్నేహితులతో కలసి శుక్రవారం వరసిద్ధి వినాయక స్వామి దర్శనార్థం వచ్చారు. దర్శనానంతరం తిరుగు ప్రయాణంలో బస్టాండ్ వద్ద తన జేబులోని ఫోన్ తీస్తున్నప్పుడు రూ.11వేలు పోగొట్టుకున్నాడు. ఆలయ ఇన్‌చార్జి హోమ్‌గార్డ్ వినాయకం ఆ నగదును దేవస్థాన ఏఈఓకు అందజేశారు. ఆపై బాధితుడిని రప్పించి ఆ ఆ మొత్తాన్ని అందజేశారు.

మత్యం వాగును పరిశీలించిన ట్రైనీ కలెక్టర్



మత్యం వాగును పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పడేల్, తహసీల్దార్, ఎస్ఐ తదితరులు

తవణంపల్లె: మండలంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మాధవరం దొరచెరువు, సరకల్లు రామన్న చెరువులు నిండి మొరవపోవడంతో కృష్ణాపురం, బోయపల్లె వాగులు ప్రవహించి బహుదానదిలో చేరాయి. దీనితో పాటు బంగారుపాళ్యం మండలంలో కురిసిన భారీ వర్షాలకు చెరువులు నిండి మొరవపోవడంతో ఎగువ మత్యం- దిగువమత్యం మధ్యలో ఉన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ ప్రవాహం ధాటికి పైపులు కూడా కోతకు గురవుతున్నాయి. ట్రైనీ కలెక్టర్ నరేంద్రపడేల్, తహసీల్దార్ సుధాకర్, ఎస్ఐ చిరంజీవి, అధికారులతో కలిసి మత్యం వాగును పరిశీలించారు. వాగు ఉధృతి తగ్గే వరకు ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

కార్యకర్తల ప్రాధాన్యతకే గ్రామ కమిటీలు

- పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్
- కరిడివారిపల్లె, జిల్లేడుపల్లెలో గ్రామ కమిటీలు ఏర్పాటు



జిల్లేడుపల్లెలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో నాయకులు

బంగారుపాళెం: గ్రామ స్థాయిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అధిక ప్రాధాన్యత కల్పించి పార్టీని బలేపేతం చేసేందుకే పంచాయతీ, గ్రామ అనుబంధ కమిటీలను నియమిస్తున్న ట్లు మాజీ ఎమ్మెల్యే, పూతలపట్టు నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని కరిడివారిపల్లె, జిల్లేడుపల్లె పంచాయతీలలో గ్రామ కమిటీలు ఎంపికకు పూనుకుని దిశా నిర్దేశం చేశారు. గ్రామ స్థాయిలో ఏర్పాటైన కమిటీ సభ్యులు పార్టీ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీకోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఇవ్వడంతో పాటు వారికి అన్ని విధాలా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పిస్తారన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో యువతకు, కార్యకర్తలకు ప్రాధాన్యత ఇస్తారన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలు

విద్య, వైద్య రంగాలను రెండు కళ్లుగా భావించి తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి చేస్తే, కూటమి ప్రభుత్వ సీఎం చంద్రబాబు ఆ రెండింటినీ సర్వనాశనం చేశారని సునీల్‌కుమార్ మండిపడ్డారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరించడానికి వ్యతిరేకంగా శుక్రవారం బంగారుపాళెంలో కోటిసంతకాల ప్రజా ఉద్యమ పోస్టర్లను ఆవిష్కరించి, సంతకాల సేకరణకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించడం దుర్మార్గమని సునీల్‌కుమార్ విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలల నిర్మాణాలకు పూనుకుని, వాటిలో ఐదు కళాశాలల నిర్మాణం పూర్తి చేశారన్నారు. రాష్ట్రం, ప్రజల భవిష్యత్ కోసం తమ అధినేత తపించి, సంక్షేమం, అభివృద్ధికి పక్కా ప్రణాళికలతో పనులు చేస్తే, చంద్రబాబు మాత్రం పబ్లిసిటీ షో మాత్రమే చేస్తూ తమ అధినేత చేసిన పనులను ఉద్దేశపూర్వకంగా నిర్వీర్యం చేస్తున్నారని నిరసన వ్యక్తం చేశారు. మొత్తంగా రాష్ట్రంలో ఉన్న పేద ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తూ ప్రజా వ్యతిరేకత మూట కట్టుకుంటున్నారని, రాబోయే కాలంలో ప్రజలే గుణపాఠం చెప్పడం తథ్యమన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యురాలు లలితకుమారి, రాష్ట్ర పాలఏకరి విభాగం అధ్యక్షుడు కుమార్‌రాజా, ఎంపీపీ అమరావతి, దత్తాత్రేయరెడ్డి, కృపాసాగర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు థామస్, రాష్ట్ర సోషల్ మీడియా సంయుక్త కార్యదర్శి కిషోర్‌కుమార్‌రెడ్డి, జిల్లా కార్యదర్శులు గోవిందరాజులు, ప్రకాష్‌రెడ్డి, జిల్లా ట్రేడ్ యూనియన్ కార్యదర్శి రఘుపతిరాజు, నియోజకవర్గ, మండల సోషల్ మీడియా అధ్యక్షులు రెడ్డెప్ప, శైలేష్, మండల యూత్ అధ్యక్షుడు గజేంద్ర, మండల ఎస్సీ, మైనారిటీ సెల్ అధ్యక్షులు నాగరాజ, షాకీర్, మండల రైతు సంఘం అధ్యక్షులు అరుణామల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రచార కార్యదర్శి పాల్‌రాజ్, బూత్ కమిటీ అధ్యక్షుడు భానుప్రకాష్, స్థానిక సర్పంచులు ఆశ, భారతమ్మ, స్థానిక నాయకులు రాఘవరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, జేమ్స్, బాబు, చంద్రకాంత్, హరిప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అశోక్‌రెడ్డి, హిమబిందు, త్యాగరాజులురెడ్డి పాల్గొన్నారు.

చెరువులకు జలకళ

-మాధవనగర్-తవణంపల్లె మార్గంలో రాకపోకలు బంద్



తిమ్మోజుపల్లె వద్ద రహదారిపై ప్రవహిస్తున్న వాగు

బంగారుపాళెం: మండలంలో గురువారం రాత్రి వర్షం దంచి కొట్టింది. దీంతో వాగులు, వంకలు సాగి చెరువులకు జలకళ సంతరించుకుని, మొరవలు సాగుతున్నాయి. బంగారుపాళెంలో 78.02 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మండలంలోని మొగిలిలోని గొనిచెరువు, అనబండ్ల చెరువు, బలిజపల్లెలోని చీకలచెరువు, గుంతూరు, జంబువారిపల్లెలో గల వెంకటప్పనాయుని చెరువు, వీరప్పనాయుని చెరువు, పాలేరులోని చిల్లామల చెరువులు నిండి మొరవపోతున్నాయి. మరికొన్ని చెరువులకు నీరు చేరుతోంది. మండలంలోని తిమ్మోజుపల్లె వద్ద రహదారిపై వాగు ప్రవహిస్తుండడంతో పోలీసులు మాధవనగర్-తవణంపల్లెకు వాహనాల రాకపోకలు నిలిపివేశారు. ముంగరమడుగులో వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరడంతో ఇబ్బందులు పడ్డారు. మూడు పదుల్లకు పైగా వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. సాగు, తాగునీటికి సమస్యలు ఉండవని పేర్కొన్నారు.

శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి



వ్రతమాచరిస్తున్న భక్తులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శుక్రవారం సంకటహరచతుర్థి గణపత్రి వ్రతాన్ని భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. ప్రధాన ఆలయ అలంకార మండపంలో సిద్ధి బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవమూర్తులను సుగంధ పుష్పాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ఉత్సవ మూర్తులను ఆస్థానమండపంలో కొలువుదీర్చారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6గంటల వరకు శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి గణపతి వ్రతం జరిపించారు.

స్వర్ణ రథంపై స్వామివారు

స్వయంభు శ్రీకాణిపాక వరసిద్ధి వినాయకస్వామి శుక్రవారం రాత్రి ఆలయ మాడవీధుల్లో స్వర్ణరథంపై విహరించారు. సాయంత్రం అలంకార మండపంలో ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను స్వర్ణ రథంలో కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించారు.

సమస్యలు ఎవరికి చెప్పాలి?

-అధికారుల గైర్హాజరుపై మండిపడ్డ సభ్యులు



మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీఓ

పూతలపట్టు(యాదమరి): ''గ్రామాలలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళితే నిర్లక్ష్యం వహిస్తున్నారు.. కనీసం మండల సమావేశంలో అయినా ప్రస్తావిస్తామని వస్తే ఆ అధికారులు డుమ్మా కొడుతున్నారు.. ఇలా అయితే సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి?'' అని ఎంపీడీఓ నాగరాజుపై స్థానిక ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. శుక్రవారం పూతలపట్టు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కుమారి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలు శాఖల అధికారులు గైర్హాజరవడం, తమకు బదులు సహాయక ఉద్యోగులను పంపడంతో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు మండిపడ్డారు. అధికారులకు బదులు వచ్చిన సహాయకులకు విషయ పరిజ్ఞానం అంతంతమాత్రమే కావడంతో సభ్యుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. సర్పంచ్ ఎంఎస్ మణి మాట్లాడుతూ, ప్రస్తుత వర్షాలకు ఆకనంబట్టులోని ఉన్నత పాఠశాలలో కొన్ని గదులు శిథిలావస్థకు చేరడంతో ప్రమాదాలకు తావిచ్చేలా ఉన్నాయని, వాటిని కూల్చి కొత్త గదులు నిర్మించాలని గత రెండు సమావేశాల నుంచీ చెబుతున్నా పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. . పక్కాలగుట్టలోని జగనన్న కాలనీలోని ప్రజలకు, పూతలపట్టు ప్రజలకు దాహార్తి తీర్చడానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నీటి ట్యాంకును మంజూరు చేసి పనులు కూడా ప్రారంభించిందని, అయితే ప్రభుత్వ మారడంతో ఎక్కడి పనులు అక్కడ ఆగిపోవడంతో ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కో-ఆప్షన్ సభ్యుడు ఖాదర్‌వలీ ఆవేదన వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం స్త్రీశక్తి పథకం ప్రారంభించినా.. మహిళలు చెయ్యెత్తితే ఆర్టీసీ బస్సులు నిలపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేటమిట్టలో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని, చెత్త సేకరణ కేంద్రాన్ని నిర్మించాలని సర్పంచ్ రాధాకృష్ణ కోరారు. తహసీల్దార్ రమేష్ బాబు, డిప్యూటి ఎంపీడీఓ శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ, ,అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.